# పాఠం

వ్యక్తిగత గుణాలు జన్మగతంగా సంక్రమిస్తాయా?
పెంపకంలో వస్తాయా?

—జయప్రద

"రాధా! పిల్లలకు ఎంత అడిగితే అంత ఇచ్చి నువ్వు చెడిపేస్తున్నావనిపిస్తోందిరా"

నవ్వేసాడు రాధాకృష్ణ రమణకు అలా అనడం అలవాటే, రాధాకృష్ణకలా నవ్వడమూ అలవాటే.

"అలా నవ్వి కొట్టిపారేయకు. ఇది వాళ్ళ భవిష్యత్తుకి సంబంధించిన విషయం."

"భవిష్యత్తా?" అని మరలా నవ్వబోయి ఆగాడు రాధాకృష్ణ.

"రమణా! నాకు బొత్తిగా నమ్మకంలేదు మన పిల్లల భవిష్యత్తును మనం నిర్మించగలమని."

"ఊహుఁ నీ అభిప్రాయం నాకు నచ్చలేదు. మన పిల్లల్ని మనం కనిపారేయడంతోనే మన బాధ్యత తీరిపోలేదు. మన ఆనందం కొరకే మన పిల్లలు అనుకుంటే అన్యాయపు ఆలోచన మరొకటుండదు" తీవ్రముగా అన్నాడు రమణ.

అతని కంఠంలోని తీవ్రత, అతని వేళ్ళ కొసలతో ఇసుకలో అతను గీస్తున్న గీతల్లో రిఫ్లెక్ట్ అవుతోంది.

స్నేహితుడి ఆవేశానికి చిరునవ్వు నవ్వాడు రాధాకృష్ణ.

"రమణా! నేను బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నట్టు నీ కన్పిస్తోందా?"

మౌనంగా అవునన్నట్టు చూసాడతను.

"పిల్లలు మన ఆనందానికే....నిజం కానీ వాళ్ళు చెడిపోవాలని మనం కోరుకోం. వాళ్ళు బాగుపడి మనల్నేదో ఉద్ధరించాలని కాకపోయినా ప్రకృతి సిద్ధంగా మనలో వుండే మమకారాలు వాళ్ళు బాగుపడాలనే కోరుకుంటాయి. కానీ రమణా చెప్పాగా నాకు నమ్మకం లేదు మనం వాళ్ళని బాగుపర్చగలమని" అంటూ లేచి నిల్చుని ప్యాంటుకంటుకున్న ఇసుకను దులుపుకున్నాడు రాధాకృష్ణ.

"నీకి టాపిక్ ఇష్టమున్నట్టు లేదు. ఓకే. పోనీ కాసేపు కూర్చో నాకప్పుడే ఇంటి కెళ్ళాలని లేదు"

"తప్పదు రమణా! ఇప్పుడు కాకపోతే ఇంకో అరగంట తర్వాత అయినా ఇంటికెళ్ళాల్సిందే. మన కిష్టంలేని బరువుల్నుండి ఓ అరగంట సేపు ఎస్కేప్ కాగలమంతే కదూ!" అంటూ కూర్చున్నాడు రాధాకృష్ణ.

"రీడింగ్ లాయర్‌వి నీకేమయ్యా ఎన్ని కబుర్లయినా చెప్తావు. రెండు చేతులా సంపాయిస్తున్నావు, మాలాటి వాళ్ళకు ఇంటికెళ్ళాలంటే ఎప్పటికీ భర్తీకాని లోట్లే కన్పిస్తుంటాయి."

"ఒక రకంగా నిజమే నువ్వు చెప్పింది. కానీ భర్తీకాని లోట్లు

మా జీవితాల్లోనూ వుంటాయి. కాకపోతే అవి అర్థికపరమైనవి కాకపో వచ్చు."

అలా అంటున్నప్పుడు రాధాకృష్ణకి గతించిపోయిన ఇల్లాలు వేద వతి గుర్తు వచ్చింది.

ఈ జీవితంలో కెల్లా ఆ లోటును ఎవరయినా భర్తీ చేయగలరా? తనకి మరో భార్య రావచ్చు కానీ వేదవతిరాదు. అది కఠిన నిజం.

"రాధా!" ఆర్ద్రంగా పిలిచాడు రమణ. అతనికి తెలుసు స్నేహి తుడి గుండెల్లో వేదన.

"ఇలా నువ్వుండిపోవడం నాకు నచ్చలేదురా"

జవాబు చెప్పలేదు రాధాకృష్ణ.

"నీ కొరకు కాకపోయినా పిల్లలకొరకు చెప్తున్నాను. వాళ్ళు చెడి పోతున్నారు."

రాధాకృష్ణ ఆరిపోయిన పెదాలమీద చిరునవ్వు మెదిలింది.

"ఒకవేళ నేను పెళ్ళి చేసుకుంటే అది నా కొరకే గాని పిల్లల కొరకు కాదు. పిల్లలకు మరో జీవితం ముందుంది. కానీ నాకు రెండో భార్యగా వచ్చే అమ్మాయికి నా తోటే జీవితం. నా పిల్లలతోటి కాదు ఏమంటావ్?"

రమణ స్నేహితుడు చెప్పిన సత్యాన్ని జీర్ణించుకుంటూ అన్నాడు.

"అన్నీ డీప్‌గా ఆలోచిస్తావు నువ్వు. ఒక్క పిల్లల విషయంలో తప్ప"

"పిల్లల విషయంలో నేనాలోచించడం లేదా?" అంటూ ఆలోచ నల్లో పడిపోయాడు రాధాకృష్ణ

చాలా సేపటిదాకా స్నేహితుణ్ని డిస్టర్బ్ చేయలేదు రమణ.

"బాగా చీకటి పడింది వెళదామా! రోడ్డుకూడా అంత బాగలేదు"

మౌనంగా లేచి నిల్చున్నాడు రాధాకృష్ణ. అతనింకా ఆలోచిస్తున్నాడు.

'నేను పిల్లల విషయం పట్టించుకోవడం లేదా?' ఇసుక దాటి, సరుగుడు చెట్లు దాటి, గవర్నమెంట్ గెస్ట్‌హౌస్ దాటి, వంతెనదాటి మైపాడు రోడ్డుమీదకు పడ్డాక కూడా అతని ఆలోచన తెగలేదు. ఇంకా పిల్లల గురించి ఎలా పట్టించుకోవాలో, అతనికి బోధపడలేదు.

రమణ స్కూటర్ స్టార్ట్ చేసిన శబ్దానికి తన ఆలోచనా సరాన్ని తెంపి స్కూటర్ వెనుక కూర్చున్నాడు రాధాకృష్ణ.

★ ★ ★ ★

"ఎందుకని అడక్కుండానే పదిరూపాయలిస్తున్నావా హేమంత్‌కి" రాధాకృష్ణ ఆఫీసురూమ్‌లో క్లయింట్‌తో వున్నాడనే విషయాన్నికూడా విస్మరించి విస్మయంగా అడిగాడు రమణ.

"మరలా రేపు కలుస్తాను" అని క్లయింట్ లేచి వెళ్ళిపోయాక కుర్చీలో రిలాక్స్ అవుతూ అన్నాడు రాధాకృష్ణ.

"ఎందుకని అడిగితే వాడబద్ధం చెప్తాడని నా భయం."

"ఎందుకని? అడిగి పూర్కోవడం కాదు. అంత చిన్నవయసులో వాడి ఖర్చులను మనం కట్ చేయాలి. లేకపోతే అంత లావిష్‌గా ఖర్చు చేయడానికి అలవాటు పడ్తారు. డబ్బు విలువ తెల్సి పెరగాలిరా పిల్లలు."

"ఖర్చు చేస్తేనే వాళ్ళకు డబ్బు విలువ తెలుస్తుందని నా ఊహ"

"నీ ఊహల్ని, నీ అభిప్రాయాల్ని వాళ్ళమీద రుద్ది వాళ్ళను పాడు చేస్తున్నావు."

రాధాకృష్ణ మరలా ఆలోచనల్లోకి జారిపోయాడు.

"నేను నా పిల్లల్ని చెడిపేస్తున్నానా?"

"రాఘవేడీ?"

"పిక్చర్ కెళ్ళాడు"

"ఎవరితో"

"వాళ్ళ క్లాస్ పిల్లలతో"

"వాళ్ళ క్లాస్ పిల్లల్తోనా" విస్తుపోతూ చూసాడు రమణ.

అవునన్నట్టు తలూపాడు రాధాకృష్ణ.

"నాలుగోక్లాస్ పిల్లోడు వాళ్ళ క్లాస్ పిల్లల్తో సినిమాకెళ్ళేంత పెద్దవాడా?"

తన స్నేహితుని తాలూకు ప్రతిచర్యా రమణకు ఆశ్చర్యంగానే వుంటుంది.

"పిల్లలకి మనం కొంత స్వేచ్ఛనివ్వాలి రమణా" నిదానంగానే అయినా స్థిరంగా అన్నాడు రాధాకృష్ణ.

"పిల్లలకు స్వేచ్ఛనివ్వాలా?" కొత్త థియరీని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు రమణ.

"రావోయ్ రా పెద్దాడివయిపోయావే. చాలా నెలలయింది నిన్ను చూసి" తన స్నేహితుడు ఆహ్వానిస్తున్న కొత్త అతిథిని చూసి నివ్వెరపోయాడు రమణ.

వాడు తన పెద్ద కొడుకు.

"నువ్వు ఒక్కడివే వచ్చావా?"

రమణ యింటికి, రాధాకృష్ణ ఇంటికి షుమారు రెండుకిలోమీటర్ల దూరముంటుంది.

రమణ కొడుకు మాధవ్ వయస్సు పది.

"తమ్ముడు కూడా వచ్చాడు నాన్నా నాతో"

"తమ్ముడా నీకు తోడు" కోపంగా చూసాడు రమణ.

ధైర్యం తెచ్చుకుని లోపలికి రాబోతున్న రమణ రెండో కొడుకు ఎనిమిదేళ్ళ రాజేష్ తండ్రి కోపానికి గడపదగ్గరే ఆగిపోయాడు.

"అసలెందు కొచ్చావ్?"

అసలు విషయం చెప్పడానికి అరగంటసేపు పట్టింది వాడికి.

"పిక్నిక్ ఏ వూరికోయ్" వాడి అవస్థచూసి రాధాకృష్ణకి జాలేసింది.

"ముత్తుకూరుకట"

"ముత్తుకూరా? చాలా బాగుంటుంది. స్టీమ్‌బోట్‌మీద ఆలల్లో కెళ్ళడం"

స్నేహితుడి పరవశానికి రమణకు ఒళ్ళు మండింది.

"ముత్తుకూరికి యిద్దరు పిల్లలకు పదిరూపాయలా?"

"పదిరూపాయలు కాదు నాన్నా. చెరి మూడురూపాయలు మాష్టారికి కట్టాలి"

"ఊం నాలుగురూపాయలేం చేస్తావ్?"

"చాక్లెట్లు కొనుక్కుంటాం. అందరూ మనిషికి ఐదురూపాయలు తెచ్చుకుంటున్నారు" మొదట చాలా బెరుగ్గా చెప్పి ఆఖరి మాట వేగంగా చెప్పి ముగించాడు వాడు.

"నాలుగురూపాయలకు చాక్లెట్లా? ఒక్క చాక్లెట్ ఎంత?"

"పది పైసలు" తకీమని జవాబు చెప్పాడు వాడు.

"చాక్లెట్ పదిపైసలయితే రూపాయికెన్ని చాక్లెట్లు వస్తాయి?"

రాధాకృష్ణకు వాడినిచూస్తే జాలి పెరిగిపోతోంది.

స్నేహితుడు టీచర్ కుర్చీలో కూర్చుని గదమాయిస్తున్నాడు. ఆ స్నేహితుడి కొడుకు చేతులు కట్టుకుని తండ్రివేసిన లెక్కచేయడానికి తంటాలు పడుతున్నాడు. భయానికి సగం అతనికాలెక్క తేలడంలేదు.

అఖరకు చెరి రెండు చాక్లెట్లకు సాంక్షన్ చేసి ఆరురూపాయలు తను స్వయంగా వెళ్ళి టీచర్కి కడ్తానని చెప్పి, వాళ్ళిద్దరూ అలా ఎక్కడకూ మరెప్పుడూ రాకూడదని హెచ్చరించి లేచి వాళ్ళతో రమణ బయటకు నడిచాక చాలాసేపటి దాకా రాధాకృష్ణ ఆత్మ పరిశీలన చేసుకుంటూనే వున్నాడు.

*　　*　　*　　*

తన క్లయింట్ పనిమీద హైదరాబాద్ వెళుతున్న రాధాకృష్ణ ఫస్ట్క్లాస్ కంపార్ట్మెంటు బెర్తుమీద ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాడు.

"హేమంత్ ఎందుకిలా తయారయ్యాడు.

ఇప్పుడే కాదు ఎప్పుడు కాస్త తీరిక దొరికినా తన పాతికేళ్ళ మొదటి కొడుకు గురించి ఆలోచిస్తూనే వున్నాడు, తల బద్దలకొట్టుకుంటూనే వున్నాడు.

తనలాగే అడ్వకేట్ని చేసాడు హేమంత్ని, రాఘవని. నిజానికి వాళ్ళలో ఒకర్ని డాక్టర్ని, మరొకర్ని ఆడిటర్ని చేయాలనుకున్నాడు. కానీ ఇద్దరూ చదువులో అంత తెలివిగలవాళ్ళు కాకపోవడంతో ఇంటర్ తర్వాత బి.ఎ., బి.ఎ. తర్వాత బి.ఎల్. చేయించక తప్పలేదు. ఇద్దరికీ తనంత ప్రాక్టీస్ లేదు. ప్రాక్టీస్ లేకపోయినా, సంపాదన లేకపోయినా పర్వాలేదు. తను ఖర్చుచేయగా మిగిలిందే ఇంకా చాలా వుంది. కానీ హేమంత్ ఈ రకపు ప్రవర్తనే తనని మానసిక వ్యాధిగ్రస్తుణ్ని చేస్తోంది.

హేమంత్ ప్రవర్తన గుర్తువచ్చినప్పుడల్లా రాధాకృష్ణకు గిల్టీగా వుంటుంది. ఆ గిల్టీ ఫీలింగ్ వెనక రమణ గుర్తుకొస్తాడు. ఇంచుమించు పదిహేనేళ్ళ తర్వాత కూడా.

రాధా! నీ పద్ధతేం బాగలేదు. నీకు డబ్బుందొచ్చు కానీ వాళ్ళని డబ్బులో పెంచి చెడిపేస్తున్నావు" అనే రమణ మాటలే స్పష్టంగా విన్పిస్తుంటాయి.

నేను సర్వస్వేచ్ఛా యిచ్చి నా కొడుకుని చెడిపేసుకున్నాను అనే ఆత్మనింద అతన్ని వదలడం లేదు. పైగా పెళ్ళొకటి చేసి ఆ పిల్లనీ అన్యాయం చేసాడతను.

"ఎందుకిలా తయారయ్యాడు హేమంత్"

డబ్బువల్ల వచ్చే సుఖాలన్నీ తనూ కొనుక్కున్నాడు. ఏ వస్తువు కావాలనుకుంటే అది ఇంటికి తెచ్చుకున్నాడు. ప్రతి సినిమా తప్పని సరిగా చూసాడు. కోర్టు హాలిడేస్‌లో ఒక్కోసారి ఒక్కోదేశం చొప్పున ఇంచుమించు ప్రపంచమంతా తిరిగాడు. కానీ హేమంత్‌లా తనెప్పుడూ బాధ్యతను విస్మరించలేదు, ఇంట్లో ఎవ్వరినీ బాధపెట్టలేదు.

హేమంత్‌లో ఎలా వచ్చింది ఇంతటి విశృంఖత?

భార్య మనసు నొప్పించి తను మాత్రమే సుఖం కొనుక్కునే తత్వం ఎలా వచ్చింది?

దానివల్ల అతనికి లభించేదేముంటుంది? ఒక బాధ్యతాయుతమైన ప్రొఫెషన్‌లో ఉంటూ హఠాత్తుగా ఎందుకిలా ఇంట్లోనుండి మాయమవుతుంటాడు?

హేమంత్ తనకు కనపడి ఇప్పటికి పదిరోజులు. కోడలి చూపులను తను తట్టుకోలేకుండా వున్నాడు.

"మీరే వారిని చెడిపేసింది" అన్నట్లుందామె చూపు. ఆ అమ్మాయి నోరుతెరిచి ఏమీ అనదు కానీ ఆ పిల్లగుండెల్లో అసంతృప్తిని తను గ్రహించగలడు.

"నిజమే అతి స్వేచ్ఛనిచ్చి డబ్బంటే ఏమిటో తెలియని వయస్సులో డబ్బులో ముంచి హేమంత్‌ని చెడిపేసాను" విపరీతంగా బాధపడే సమయాల్లో రాఘవ అతనికి చిన్న స్వాంతన.

రాఘవని కూడా తనే పెంచాడు, డబ్బులో పెంచాడు.

కానీ రాఘవలో జీవితాన్ని ఎంత త్వరలో, ఎంత అనుభవించగలిగితే అంత అనుభవించాలనే ఆరాటంలేదు. తండ్రిలా ముందుకెళ్ళాలని, తన ప్రొఫెషన్‌లో షైన్ కావాలనే కోరిక గాఢంగా వుంది. డబ్బులిచ్చే సుఖాలను చిన్నప్పటినుండీ అనుభవించిన అతనికి, ఇంకా అనుభవిస్తున్న అతనికి అందులో నిషా కన్పించలేదు.

ఆలోచించి, ఆలోచించి అలసిపోయిన అతనికి కనురెప్పలమీదగా నిద్రపర్చుకున్నట్టయి మెత్తటి బర్త్‌మీద వాలాడు.

అలా వాలిన సెకండ్ల తర్వాత అది నిద్రకాదని అలసట అని తెలియడానికి అతనికెంతోసేపు పట్టలేదు.

మరలా లేచి బాగ్‌లోనుండి కాంపోజ్ మాత్ర వేసుకుని పడుకున్నాడు.

అతను నిద్రలేచేసరికి బాగా తెల్లారిపోయింది.

బాగా లేట్‌గా రన్ అవుతున్నట్టుంది ట్రెయిన్.

ఏదయినా ఆలేరు స్టేషన్‌లోనే వుంది. లేచి కూర్చుని బయటకు చూసాడు.

"కాఫీ సార్" చాలా ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వచ్చాడు పదిహేడేళ్ళ అబ్బాయి.

"వద్దు" పంపించేసాడు.

కొద్ది దూరంలో మంచినీళ్ళు సప్లయ్ చేస్తున్నాడో వృద్ధుడు.

అతని పెదాలమీద చెరగని చిరునవ్వు.

వచ్చిన వాళ్ళతో జోక్స్‌వేస్తూ వాళ్ళ సమాచారాలడుగుతూ చాలా హాయిగా నవ్వుతున్నాడు.

"హేమంత్‌లాటి కొడుకు లేడేమో అతనికి" నిట్టూర్చాడు రాధా కృష్ణ.

అతనికి రావాలని లేదు–కనీసం పళ్ళు తోముకునే శక్తికూడా లేదు.

అతని గిల్టీ ఫీలింగ్ అతన్ని కృంగదీస్తోంది.

వర్క్‌లో వున్నపుడు అన్నీ మర్చిపోయి కాస్త బాగుంటాడు.

ఇదో ఇలా విశ్రాంతి దొరికినపుడే అది అతన్ని కొరికేస్తోంది.

"అతనెవరూ అతనెవరూ? రమణకాదూ" వెయ్యిలీటర్ల శక్తివచ్చి నట్లు దగ్గరకు పరుగెత్తాడు.

మంచినీళ్ళ గ్లాసు తీసుకుని తన కంపార్టుమెంట్‌వేపు వెళుతు న్నాడు.

అతను రమణకాక ఇంకెవరూ?

"రమణా!"

ఆ చిన్న ప్లాట్‌ఫారం ప్రతిధ్వనించిన ఆ కేకకు వెనక్కు తిరి శమణ.

అతని కళ్ళు మెరిసాయి.

అతని పెదాలు విచ్చుకున్నాయి.

వేగంగా వెనక్కి తిరిగొచ్చి స్నేహితుడి చేయిపట్టుకుని కంపార్ట్ మెంట్‌లోకి ఎక్కేసాడు.

చాలా ఆనందంగా వుంది వాళ్ళిద్దరికీ.

వాళ్ళిద్దరూ కలుసుకుని అప్పటికి సరిగ్గా పదేళ్ళు.

"రాధా చాలా మారిపోయావ్?"

"నువ్వూనూ!" అని పేలవంగా నవ్వాడు రాధాకృష్ణ.

"ఎక్కడనుండి?" రమణవేపు స్నేహంగా చూస్తూ అడిగాడు.

"మా చిన్నోడికి సంబంధం చూడడానికొచ్చి తిరిగొస్తున్నాము"

"కుదిరిందా?"

"లేదు–నచ్చలేదు"

ఆ సంభాషణనిక పొడిగించలేదు రాధాకృష్ణ.

"పిల్లలు బాగున్నారా? హేమంత్‌కి ఎంతమంది పిల్లలు?"
"ఇద్దరు"
"రాఘవకు పెళ్ళిచేసావా?"

"నీకు వ్రాసానుకదూ? కానీ అనుకున్న డేట్‌కంటే ముందుగా హఠాత్‌గా పెళ్ళిచేయాల్సి రావడంతో ఎవ్వరికీ ఇన్విటేషన్లు వేయలేదు" షట్టర్ పూర్తిగా ఎత్తేస్తూ సంజాయిషీ ఇచ్చాడు.

"పోనీలే–మాధవ్ పెళ్ళికి నువ్వెలాగూ రాలేదు. రాజేష్ పెళ్ళికి మాత్రం తప్పక రమ్మని వ్రాయాలనుకుంటూ వున్నాను. నువ్వే కన్పించావు" సంతోషంగా అన్నాడు రమణ.

"నిజమే ఏవిటో ఇలా జీవితాల్లో పడిపోయాం ఈసారి తప్పక వస్తాను"

చాలా పొడిగా సాగుతోంది సంభాషణ.

తన మనసులో బాధ స్నేహితుడితో చెప్పుకొని తను చేసిన మహా తప్పును రమణ ముందు ఒప్పుకుంటేగానీ రాధాకృష్ణ మనసులో ఆరాటం తీరేట్టు లేదు.

గమణ కూడా ఏదో చెప్పబోయో, అడగబోయో ఆగిపోతున్నాడు.

"హేమంత్, రాఘవ ప్రాక్టీసు బాగుందా?" అడిగాడు రమణ.

ఇక ఫూరుకోలేదు రాధాకృష్ణ. హేమంత్ గురించి అంతా చెప్పేసుకున్నాడు.

"నువ్వన్నట్టు వాడిని డబ్బులో ముంచి చెడిపేసాను రమణా!"

రమణ జవాబిచ్చేంతలో ట్రెయిన్ ఆగింది.

దిగబోయిన రమణను వారించాడు రాధాకృష్ణ.

"నేను టి.వి.తో మాట్లాడతాను ఇక్కడే వుండిపో"

"నేను నెక్స్ట్ స్టేషన్‌లో వస్తాను. మా ఆవిడ త్రీ టైర్‌లో వుంది. కంగారుపడుతుంది" అనేసి పరుగెట్టాడు రమణ.

రమణ వెళ్ళిపోయాక మరలా రాధాకృష్ణలో నిస్సత్తువ వ్యాపించింది.

నీరసంగా తన సీట్లో కూర్చున్నాడు.

రమణకి, తనకి మధ్య అయిదు సంవత్సరాలుగా ఉత్తరాలు లేవు.

ఇద్దరి దగ్గరా అడ్రసులు మాత్రం ఉన్నాయి.

ఎప్పుడయినా ఇద్దరిలో ఒకరికి ఆవేశంవచ్చి–

"ఇది మరీ దారుణం.మనమధ్య ఉత్తరాలు లేకపోవడం. నువ్వో మంచి వుత్తరం వ్రాయి ఆ స్టిములేషన్‌తో నేనో పెద్ద వుత్తరం వ్రాస్తాను' అని వ్రాస్తే అవతలివ్యక్తి స్టిములేషన్ వచ్చి వ్రాసేసరికి ఇవతలి వ్యక్తికి స్టిములేషన్ చచ్చిపోయేది.

దాంతో వాళ్ళిద్దరి పర్సనల్ విషయాలు మరొకరికి తెలీకుండా పోయాయి

'ఇప్పుడు తను రమణ ముందు దోషిలా తలవంచుకోవాలి. నేను చెపితే విన్నావా' అని రమణ అంటే ఆ అభియోగాన్ని తను అంగీకరించాలి

అలా అనుకున్నప్పుడు అతని శరీరంలో బరువు మరో టన్ను పెరిగింది.

స్నేహితుణ్ని చాలా సంవత్సరాల తర్వాత కల్సుకున్నాననే ఆనందాన్ని అది క్రూరంగా చంపేస్తోంది.

అతనలా విచార పడుతుండగానే భువనగిరి రావడం రమణ పరిగెట్టుకుంటూ వచ్చి తన కంపార్టుమెంలోకి ఎక్కేయడం జరిగింది.

చిరునవ్వు బలవంతాన పెదాలమీద పులుముకుని జరిగి చోటు ఇచ్చాడు రాధాకృష్ణ.

రమణ అలసిపోయిన చిహ్నంగా ఆయాసపడుతున్నాడు.

ఇప్పుడు వాళ్ళ వయసు యాభయ్.

అలా స్నేహితుడి ప్రక్కన కూర్చున రాధాకృష్ణకి కొన్ని నిము షాలలో కొంత బరువు తగ్గినట్లుంది.

రమణ మాట్లాడలేదు.

ఏదో ఆలోచిస్తున్నాడు.

"నువ్వనేవాడివి గుర్తుందా? నువ్వయితే సంపాయిస్తున్నావు ఖర్చు చేస్తున్నావు. వాళ్ళనలా పెంచకు . వాళ్ళు సంపాయిస్తారో లేదో. మనకిప్పుడు తెలీదు. అప్పుడు వాళ్ళు బాధపడవల వస్తుంది" అని.

అదే జరిగిందిరా, వాడు సంపాయించింది వాడికి చాలడంలేదు.

కష్టపడి సంపాయించుకోవాల్సిన టైమ్‌ని సుఖాలకు వెచ్చించ డంతో క్లయింట్స్ తగ్గిపోయారు. సంపాదనాలేదు—దాంతో భార్యను వేధిస్తాడు డబ్బుకు.

ఈసారీ రమణ మాట్లాడలేదు.

"ఒకరకంగా వాడు శాడిస్టుగా మారిపోయాడనిపిస్తుందిరా! వాడికి సంపాదనలేదు. భార్య ఇచ్చే డబ్బుతో సుఖాలు కొనుక్కోవాలి.

సుఖాలు కావాలిగానీ భార్య తనని చిన్నచూపు చూస్తుందేమో ననే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్-భార్య అస్థుల్ని, నా అస్థుల్ని వాడి పేత వ్రాయలేదని కోపంలో వాడూ దగ్ధమయి మమ్మల్ని కాలుస్తున్నాడు.

తను తప్పులుచేస్తూ ఆ తప్పులు కప్పిపుచ్చుకోను ఎదుట వ్యక్తుల్ని దోషులుగా చేసి ఆనందపడుతున్నాననే తత్వంలో వున్నాడు. భార్య ప్రతీ కదలికనో విమర్శిస్తాడు. అలా అతని చుట్టూ మనుష్యులకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు."

తనలోని ఆరాటం తగ్గేవరకు చెప్పేసి ఆపి నిశ్శబ్దంగా వున్న రమణవైపు చూసాడు రాధాకృష్ణ.

'పాపం నన్నెట్లా ఓదార్చాలా ఆలోచిస్తున్నట్టున్నాడు' అనుకుని రమణవైపు తిరిగి అన్నాడు.

"నువ్వు చెప్పిందే నిజంరా. పిల్లలకి తెలియనివయసులో ఎక్కువ డబ్బు ఇవ్వకూడదు."

నోరు విప్పాడు రమణ.

"ఊహుఁ నీ థియరీ, నా థియరీ కూడా కరెక్ట్ కాదని రుజువు చేసారుగా మన పిల్లలు. నువ్వనేవాడివి గుర్తుందా? మన పిల్లలభవిష్యత్తును మనం నిర్మించగలమంటే నాకు నమ్మకం లేదని దాన్నిప్పుడు నేను నమ్ముతున్నాను" విచారంగా అన్నాడు రమణ.

"ఏమయ్యిందినీకు" ఆతృతగా అడిగాడు రాధాకృష్ణ.

"వుండు వస్తాను" అని బాత్‌రూమ్‌లోకెళ్ళి వచ్చి టవల్‌తో చేతులు తుడుచుకుంటూ కూర్చున్నాడు రమణ.

"కొత్తగా ఏమీ కాలేదు. మా మాధవ్ కూడా హేమంత్‌లాగే వున్నాడు. కాకపోతే ఒక్కటే తేడా....భార్య డబ్బు వాడుకోవడానికి అతని భార్య కంటూ స్వంతంగా డబ్బులేదంతే"

"మాధవ్ అలా తయారయ్యాడా నేను నమ్మను" దృఢంగా అన్నాడు రాధాకృష్ణ.

"నమ్మి తీరాలి" విచారంగా నవ్వాడు రమణ.

రాధాకృష్ణకు చలి అన్పించినట్టుంది. షాల్ తీసి కప్పుకున్నాడు. అతనికీమధ్య ఆరోగ్యం అంతంతమాత్రంగా వుంది.

"ఆరోగ్యం బాగలేదా?" స్నేహితుని ప్రక్కనే వచ్చి కూర్చుంటూ అడిగాడు అర్ధాంగారమణ.

"నాకు బాగానేవుంది. నువ్వు చెప్పు ఏమయింది మాధవ్‌కు"

తనలో తాననుకున్నంత మెల్లిగా చెప్పాడు రమణ.

"నేను డబ్బివ్వక ఒక రకంగా వాడి కోరికల్ని కట్టేసాను. ఇప్పుడు సంపాదనా పరుడై వాడు ఒక్కసారిగా సంకెళ్ళు త్రెంపుకుని ప్రతి సౌఖ్యాన్ని కొనుక్కుంటున్నాడు. దొరక్క దొరక్క దొరికిన బిచ్చగాడిలా డబ్బుతో వచ్చే ప్రతి సుఖాన్ని జుర్రుకుంటున్నాడు అతను. సంపాయించే ప్రతి పైసాకు అతని సుఖానికి తప్ప భార్యకు కూడా ఖర్చుపెట్టడాని కిష్టపడడంలేదు."

స్నేహితుడి కొడుకు కూడా చెడిపోయినందుకు బాధగానే వున్నా తన హేమంత్ చెడిపోయింది కేవలం తన పెంపకంవల్ల కాదనే ఓదార్పు రాధాకృష్ణమూర్తికి కాస్త రిలీఫ్ నిచ్చింది.

"నేను చాలా పొరపాటు చేసాను రాధా! ఆఖరకు వాడు ఉద్యోగాలకు అప్లయ్ చేసేప్పుడు కూడా ఖర్చులకు తూచి తూచి ఇచ్చేవాడిని. నా చిన్నప్పుడు మా అమ్మ మా తమ్ముడికి వాడే పాలపిండి నాకు పెట్టేదికాదు. అప్పుడనుకునే వాడిని. నేను పెద్దవాడినై సంపాయించి పది పాలడబ్బాలు కొనుక్కోవాలని పదిడబ్బాల పాలపిండి నేను కొనుక్కుని తినలేదు. అది వేరే సంగతి. కానీ పెద్దాడు మాత్రం ఇలానే అనుకొంటాడు. నేను సంపాయించాక తనివితీరా ఖర్చు పెట్టాలని. ఆలాగే వాడు ఖర్చుపెట్టి ఆనందిస్తున్నాడు. వాడిలో నేను అణిచిన కోరికలు ఇప్పుడు విజృంభించాయిరా."

"బాధపడకు ఏం చేయగలం? నేను బాధపడడంలేదు. నా మనవల్ని ఎలా పెంచాలా అని ఆలోచిస్తున్నాను."

"మనం ఆలోచించడానికి ఏమీలేదు. వాళ్ళు పిల్లల్ని మన పెంపకం దాకా రానివ్వరు. ఏదయినా చెయ్యగలిగితే మన కథని విని ఆచరించేవాళ్ళుంటే చెప్పటమే."

చిన్నగా నవ్వాడు రమణ.

"మన జీవితాల్లోనుండి పాఠాలు నేర్చుకుంటారంటావా? నాకా ఆశలేదు. ఎందుకంటే వాళ్ళ దృష్టిలో మనం తెలివితక్కువ వాళ్ళం. వాళ్ళు చాలా తెలివిగా పెంచుతామనుకుంటారు నాలాగ."

ఎవరో ఎక్కడో ప్రక్కవాడి జీవితాల్లో నుండి పాఠాలు నిర్చుకునే విజ్ఞులు-చాలామంది మనలాటివాళ్ళలా మన జీవితాల్లోనుండి పాఠాలు నేర్చుకునే విజ్ఞులు–మనలాటి వాళ్ళమంతా నష్టపోయేవాళ్ళే.

"అవును నిజమే. మనం చాలా తెలివిగా ప్రవర్తిస్తున్నామనుకున్న తెలివితక్కువ వాళ్ళం" నిట్టూర్చాడు రాధాకృష్ణ.

*